క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత

బోట్‌క్లబ్: గాంధీనగర్‌కు చెందిన కమ్మిల శ్రీనివాస్ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబానికి వైఎస్సార్ బీమా అందజేశారు. మట్టి ఖర్చుల కింద మంజూరైన రూ.10 వేల నగదును సోమవారం అతని భార్య లోవ శివ లక్ష్మికి 41వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గోడి వెంకట్ అందించారు. డివిజన్ మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి పాల్గొన్నారు.

రోటరీ బ్లడ్‌బ్యాంకులో సెంట్రిఫ్యూజ్ ప్రారంభం



యార్లగడ్డ వీర్రాజును సత్కరిస్తున్న రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: రోటరీ గోల్డెన్‌జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోటరీ బ్లడ్‌బ్యాంక్‌లో దేవీ ఫిషరీస్ రూ.22 లక్షల సీఎస్సార్ నిధులతో సెంట్రిఫ్యూజ్ పరికరాన్ని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ యార్లగడ్డ వీర్రాజు సోమవారం ప్రారంభించారు. బ్లడ్‌బ్యాంక్ చైర్మన్ టీవీ బాలకృష్ణ, రోటరీ గోల్డెన్‌జూబ్లీక్లబ్ అధ్యక్షులు జీవీ కృష్ణప్రకాష్‌లు యార్లగడ్డ వీర్రాజును అభినందించి సత్కరించారు. బ్లడ్‌బ్యాంక్ కార్యదర్శి చార్మినార్ వర్మ, క్లబ్ కార్యదర్శి వడ్డాది ఆదిత్య పాల్గొన్నారు.

మానవుడే మహనీయుడు పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేస్తున్న వేదిక అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి, నగర శాఖ కన్వీనర్ సూర్యారావు తదితరులు

కాకినాడ కల్చరల్: స్థానిక బాలాత్రిపుర సుందరి సెంటర్‌లోని ఘంటసాల కాంస్య విగ్రహం వద్ద ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక ఆధ్వర్యంలో మానవుడే మహనీయుడు పోస్టర్‌ను సోమవారం వేదిక అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఘంటసాల జీవిత చరిత్రపై అవగాహన కల్పించేందుకు మానవుడే మహనీయుడు పేరుతో సెమినార్లు, ఆయన పాటలతో సంగీత కచేరిలు నిర్వహించేందుకు వేదిక సన్నాహాలు చేస్తోందన్నారు. వేదిక కాకినాడ శాఖ కన్వీనర్‌గా తురగా సూర్యారావును నియమించినట్టు తెలిపారు. కేవీ ప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, ఎస్.సురేష్, జె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై విద్యార్థులకు బస్‌పాస్‌లు



ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో పాస్‌లు తీసుకుంటున్న విద్యార్థులు

కాకినాడ: కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన సందర్భంగా విద్యార్థులకు అన్ని రకాల పాస్‌లను సోమవారం నుంచి ఇస్తున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ తెలిపారు. హైస్కూల్, కళాశాల, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్థులకు రాయితీ పాసులు, 12 ఏళ్లలోపు బాలురకు 7వ తరగతి వరకు, 15 ఏళ్ల లోపు బాలికలకు పదో తరగతి వరకు ఉచిత పాసులు, సీజన్ టికెట్లు, వికలాంగులకు రాయితీ పాసులు ఇస్తామని తెలిపారు. కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ కౌంటర్‌లో ఉదయం 9 నుండి రాత్రి 7 వరకు పాస్‌లు ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు ఆయన సూచించారు.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు



ఇంద్రపాలెంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: మండలంలోని ఇంద్రపాలెంలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ప్రారంభించారు. గ్రామంలో సుమారు రూ.2 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల శ్రీను, మండల సీనియర్ నాయకుడు గోపిశెట్టి బాబ్జీ, ఎంపీడీఓ స్వప్న, జాన్ ప్రభాకర్, అనుసూరి ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, గీసాల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రైయూజ్ ప్లీజ్..

- జీజీహెచ్‌లో నిర్లక్ష్యానికి గురవుతున్న ట్రయాజ్ సెంటర్
- నిర్వహణ లేక పాడవుతున్న ఫ్యాన్లు, మంచాలు
- నిరుపయోగంగా ప్రభుత్వ, దాతల సాయం



జీజీహెచ్‌లో సొంత ఫ్యాను తెచ్చుకున్న రోగి

కాకినాడ క్రైం: చాలా సందర్భాల్లో అత్యవసరమై సమకూర్చుకున్న విలువైన వస్తువులు ఆ సమయం దాటాక నిరుపయోగంగా మారిపోతుంటాయి. వనరులు లేనపుడు లేవని, కావాలని ప్రతిపాదనలు.. తీరా ఏదో రూపంలో సమకూరితే నిర్లక్ష్యం.. దుర్వినియోగం. కానీ సరైన నిర్వాహకులు ఉంటే వాటిని ఎక్కడెక్కడ, ఎన్ని విధాలుగానో వినియోగించి నిధుల వృధాను అరికడతారు. అటువంటి పరిస్థితే నేడు జీజీహెచ్‌లో నెలకొంది. మరి ఈ పరిస్థితిపై అటు రోగులు.. ప్రజలు చెప్తున్నది ఒకటే.. అధికారులూ ప్లీజ్ ట్రై టూ యూజ్ అని.

కోవిడ్ రెండో దశ కరాళ నృత్యం చేస్తున్న వేళ రోగుల తాకిడి ఎక్కువ కావడంతో జీజీహెచ్ వార్డుల్లో అప్పటికప్పుడు అవసరమైన వసతులు లేక సాధారణ రోగులు, వైద్యులు సతమతమయ్యారు. దీంతో అత్యవసర సేవల కోసం కోవిడ్ ట్రయాజ్ సెంటర్‌ను ప్రభుత్వం, దాతల సహకారంలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసింది. ఈ సెంటర్‌లోకి కోవిడ్ రోగి వచ్చిన వెంటనే వైద్యులు ప్రాథమిక ఆరోగ్య పరీక్షలన్నీ అక్కడే చేసి తదుపరి సత్వర వైద్యానికి సంబంధిత వార్డులకు తరలించేవారు. ఈ సేవలతో జీజీహెచ్ ఎంతో ప్రతిష్ఠను సాధించింది. కాలం అనుకూలించింది. కరోనా ఛాయలు అక్కడక్కడా కనిపిస్తున్నా మొత్తానికి కాలగర్భంలో కలసిపోయింది. కానీ అప్పుడు సమకూర్చుకున్న మంచాలు, తాత్కాలిక నిర్మాణాలు బూజులు పట్టి శిథిలమవుతుండగా, ఫ్యాన్లు దుమ్ము పట్టి పాడైపోతున్నాయి. తాజాగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ నిర్వహించిన మాక్ డ్రిల్‌లో కూడా ఈ ట్రయాజ్ సెంటర్‌ను అధికారులు పట్టించుకోలేదు.

సద్వినియోగం చేసుకోవడంలో విఫలం

కరోనా అత్యవసర కాలంలో ట్రయాజ్ సెంటర్ కోసం సమకూర్చుకున్న మంచాలు, ఫ్యాన్లను సద్వినియోగం చేసుకునే దిశగా అధికారులు ఆలోచించాల్సి ఉంది. చాలా వార్డుల్లో ఫ్యాన్లు లేక రోగులు సతమతమవుతున్నారు. మరికొన్ని వార్డుల్లో ఒకే మంచంపై ఇద్దరు రోగులకు సేవలు అందిస్తున్నారు. క్యాన్సర్ వంటి కీలక వార్డుల్లో రోగి కీమో థెరపీ తీసుకుని విలవిలలాడుతూ వార్డులో విశ్రాంతి తీసుకుంటాడు. వారికి ఫ్యాన్లు ఎంతో అవసరం. కీమో సిద్ధం చేసే నర్సుల పరిస్థితి కూడా దయనీయమే. బయో మెడికల్ యంత్రం నుంచి వెలువడే వేడిని తట్టుకోవడం కష్టం. ఆయా ప్రాంతాల్లో ఫ్యాన్ల అవసరం ఎంతైనా ఉంది.



ఫ్యాను లేకపోవడంతో యాతన పడుతున్న క్యాన్సర్ రోగి

9 ఫ్యాన్లు... 19 పడకలు..

జీజీహెచ్‌లోని కోవిడ్ ట్రయాజ్ కేంద్రంలో 9 ఫ్యాన్లతో సహా 19 పడకలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. కోవిడ్ అత్యవసర వేళలో వీటిని దాతలు, ప్రభుత్వం సమకూర్చాయి. ప్రస్తుతం వాటిపై కుక్కలు ఎక్కి పడుకుంటూ, స్పాంజీలను చించేస్తూ పాడుచేస్తున్నాయి. ఈ కేంద్రంలోని వైరింగ్ వ్యవస్థ ఇప్పటికే ధ్వంసం అయింది.



ట్రయాజ్‌లో కుక్కలు చింపిన మంచాలు

> **అధికారులతో చర్చిస్తా**
>
> ట్రయాజ్ సెంటర్‌లో వసతులను సద్వినియోగం చేసుకునేలా ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. ఈ సెంటర్‌ను సద్వినియోగం చేసుకునేలా, ఉన్న ఫ్యాన్లు, మంచాలను వివిధ వార్డుల్లో వినియోగించడంపై నిర్ణయం తీసుకుంటామన్నారు.
>
> – డాక్టర్ రాహుల్, ఆర్ఎంఓ

స్పందన సమస్యలకు సత్వర పరిష్కారం

కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్



కాకినాడ: జగనన్నకు చెబుదాంలో భాగంగా నిర్వహించే డయల్ యువర్ కమిషనర్ స్పందన కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ చెప్పారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం 29 మంది డయల్ యువర్ కమిషనర్ ద్వారా, 10 మంది స్పందన ద్వారా వివిధ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బోట్‌క్లబ్ పార్క్ సమస్యలను అక్కడ వాకర్లు కమిషనర్‌కు వివరించారు. వాకర్ల సంఘం అధ్యక్షుడు అడబాల రత్నప్రసాదరావు, పిఠాపురం రోడ్డు వైపు విద్యుత్ దీపాలు వెలగడం లేదని కమిషనర్‌కు వివరించారు. దీనిపై కమిషనర్ ఆదేశాలకు విద్యుత్ సిబ్బంది సత్వరమే స్పందించి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకున్నారు. అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఈఈ వెంకట్రావు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్వో మానే కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతే సీఎం లక్ష్యం

- ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి
- ఏటిమొగలో ఆలయం ప్రారంభం

కాకినాడ: తీర ప్రాంతంలో నివసించే మత్స్యకారుల జీవన స్థితిగతులను మెరుగుపర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో ఎన్నడూ లేనంత ప్రాధాన్యమిస్తున్నారని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. రూ.70లక్షలతో ఏటిమొగలో నిర్మించిన గణపతి, గంగమ్మతల్లి, మత్స్యనారాయణ, కాలభైరవస్వామి ఆలయాన్ని ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఈ ప్రాంతంలో అధిక సంఖ్యలో ఉన్న మత్స్యకారుల కుటుంబాలకు అన్నివిధాలా అండగా ఉండేలా విద్య, వైద్య, నివాసాలు మెరుగుపరచేందుకు సీఎం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. మత్స్యకార్మికులకు రావలసిన పరిహారాలు వేగంగా ఇస్తున్నామన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ మత్స్యకారులంతా ఐక్యంగా ఉండి ఆలయాన్ని సుందరంగా నిర్మించుకున్నారని, భవిష్యత్‌లో వీరికి అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కాకినాడకు చెందిన వేలాది మంది అర్హులైన మత్స్యకారులకు దుమ్ములపేటలో 115 ఎకరాల స్థలాన్ని సిద్ధం చేస్తే మాజీ ఎమ్మెల్యే వనమాడి అవరోధాలు కల్పించారని విమర్శించారు. అయినప్పటికీ సీఎం తోడ్పాటుతో చొల్లంగి ప్రాంతంలో పట్టాలు ఇచ్చామని, త్వరలోనే ఇళ్ల నిర్మాణం కూడా చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్లు మీసాల ఉదయ్‌కుమార్, పసుపులేటి వెంకటలక్ష్మి, మత్స్యకార ప్రముఖులు కాటాడి జానకి రామ్, మాజీ కార్పొరేటర్లు పినపోతు సత్తిబాబు, చవ్వాకుల రాంబాబు, సంగాని నందం, పేర్ల జోగారావు, స్థానిక మత్స్యకార పెద్దలు హాజరయ్యారు.

వైభవంగా నూకాలమ్మతల్లి ఆలయ ప్రతిష్ఠ

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామ దేవత నూకలమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణం పూర్తవడంతో సోమవారం ఆలయంలో కొలువుతీరారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, శ్రీవిద్య దంపతులు ఉదయం 7.27 గంటలకు నూతన విగ్రహ ప్రతిష్ఠ, అనంతరం శిఖర ప్రతిష్ఠ చేశారు. ముఖ్య అతిథులుగా ఎంపీ వంగా గీత, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, దేవదాయ, ధర్మదాయ శాఖ డిప్యూటీ స్థపతి జి.శ్రీవాసాచార్యులు పాల్గొన్నారు. ఆలయ ఈఓ శివబాబు, గ్రామ పెద్దలు ఏర్పాట్లు పర్యవేక్షించారు. గ్రామస్తుల విన్నపం మేరకు దేవదాయ, ధర్మదాయశాఖ నుంచి సీజీఎఫ్ నిధులు రూ.50 లక్షలతో ఆలయాన్ని నిర్మించినట్టు తెలిపారు. ఎంపీ గీత మాట్లాడుతూ అమ్మవారికి సర్వోపచారాలు చక్కగా నిర్వహించాలని, ఆలయ నిర్మాణంలో ఎమ్మెల్యే కన్నబాబు చొరవ అభినందనీయమని అన్నారు. నియోజవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

రిలయన్స్ నుంచి పరిహారం ఇప్పించండి



రిలయన్స్ పరిహారం కోసం ధర్నా చేస్తున్న మత్స్యకారులు

కాకినాడ సిటీ: రిలయన్స్ పరిహారం అన్ని గ్రామాలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పలు ప్రాంతాల మత్స్యకారులు సోమవారం ధర్నా చౌక్ వద్ద ఆందోళన చేశారు. గాడిమొగ రిలయన్స్ పైప్‌లైన్ల వల్ల మత్స్యసంపద నాశనమై, మత్స్యకారులు జీవనాధారం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని ఆదుకోవాని, పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. తెలుగు జనతాపార్టీ జాతీయ అధ్యక్షుడు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు మద్దతు పలికారు. వేట నిషేధ సమయంలో పలువురికి ప్రభుత్వం జీవనాధారం కోసం పరిహారాన్ని అందిస్తోందన్నారు. అలాగే రిలయన్స్ పైప్‌లైన్ వల్ల నాశనమవుతున్న మత్స్య సంపద వల్ల తాము ఉపాధి కోల్పోతున్నామని, దానికి సకాలంలో పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మత్స్యకార ప్రతినిధులు సంగాడి వెంకటేశ్వరరావు, పొన్నాడ ధర్మారావు, మల్లాడి లోవరాజు, గరికిన కుమార్‌రాజా, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ కృతికా శుక్లాను కలసి వినతిపత్రం అందజేశారు.

ఎస్ఎంల సేవలు అభినందనీయం

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌లో స్టేషన్ మాస్టర్లు యుఎస్ శ్రీకాంత్, కె.శంకరరావు ఉత్తమ సేవలు అందించారని స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ అన్నారు. ఉద్యోగుల బదిలీ ప్రక్రియలో భాగంగా శ్రీకాంత్ కాకినాడ పోర్టు స్టేషన్ మాస్టర్‌గా, కె.శంకరరావు రాజమహేంద్రవరం స్టేషన్ మాస్టర్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సోమవారం వారిని అభినందించి, వారి సేవలను కొనియాడారు.



బదిలీ అయిన ఉద్యోగులను సత్కరించిన స్టేషన్ మేనేజరు, స్టేషన్ మాస్టర్లు

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తులు కిటకిటలాడారు. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో అర్చకులు తొలి పూజ చేసి అనంతరం భక్తుల పూజలను చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దేవస్థానం తరపున అన్న దానం ఏర్పాటు చేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు సభ్యులు, దేవదాయశాఖ సిబ్బంది భక్తులకు సేవలందించారు. పూజల అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయంలోని ఉప ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు చేశారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

పెద్దాపురం: జిల్లా పునర్విభజనతో పరిపాలన సౌలభ్యం సాధ్యపడుతుందని, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని తొలి ఎంపీడీఓగా నియమితులైన బత్తిన అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంపీడీఓగా కొనసాగిన హిమమహేశ్వరి పదోన్నతిపై అనపర్తి ఎంపీడీఓగా వెళ్లారు. 2007 గ్రూప్–1కు ఎంపికైన అశోక్‌కుమార్ ఈఓపీఆర్డీగా బిక్కవోలు, రాయవరం మండలాల్లో సేవలందించారు. అక్కడ నుంచి వై.రామవరం, మారేడుమిల్లి ఇన్‌చార్జి ఎంపీడీఓగా విధులు నిర్వహించి తాజాగా పెద్దాపురం ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. ప్రతి అర్జీని పరిష్కరించాలని, గ్రామీణ పాలనపై శ్రద్ధచూపి అంకితభావంతో పనిచేయాలని, సిబ్బందితో కలసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన తెలిపారు. తొలుత ఆయన రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దవులూరి దొరబాబు, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతిలను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, ఈఓపీఆర్‌డీ మూర్తితో కలసి పలు అంశాలపై సమీక్షించారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.



ఎంపీడీఓ అశోక్‌కుమార్‌ను అభినందిస్తున్న అధికారులు, పంచాయతీ కార్యదర్శులు

విద్యలో విప్లవాత్మక మార్పులు



జేవీకే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ గీత, కలెక్టర్ కృత్తికా శుక్లా, ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి



విద్యార్థినికి జగనన్న విద్యా కానుక అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

- ఎంపీ వంగా గీత
- జేవీకే కిట్ల పంపిణీ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు సీఎం జగన్ కృషి చేస్తున్నారని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. స్థానిక సాలిపేట మున్సిపల్ పాఠశాలలో సోమవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చడంతో పాటు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు దేశానికి, రాష్ట్రానికి పేరు తీసుకురావాలనే ఉద్దేశంతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. కలెక్టర్ కృత్తికాశుక్లా మాట్లాడుతూ పాఠశాల ప్రారంభం రోజునే అన్ని రకాల వస్తువులు కిట్ రూపంలో ఇస్తున్నామని, పేదరికం విద్యకు అడ్డురాకూడదని ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ చదువు ఎవరూ దొంగిలించలేని ఆస్తి అని, అమ్మఒడి, విద్యాకానుక వంటి పథకాలతో గొప్ప మార్పులు వచ్చాయని అన్నారు. నగరంలో దూర ప్రాంత విద్యార్థులకు జూలై 8 నుంచి రెండు బస్సులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, ఆర్‌జేడీ నాగమణి, డీఈఓ అన్నపూర్ణ, డీవైఈఓ డానియల్ రాజు, మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న, సీఎంఓ చామంతి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు జగనన్న కానుక

కాకినాడ సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. నియోజకవర్గంలో తూరంగి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై జగనన్న విద్యాకానుకలను పంపిణీ చేశారు. సరికొత్త హంగులతో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారన్నారు.రెండో విడత నాడు–నేడు కింద అనేక పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేందుకు ఇంగ్లిషు ల్యాబ్‌లను కూడా నిర్మించారన్నారు. విద్యార్థులకు జగనన్న అందజేస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని మంచిగా చదివి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్, పాఠశాల హెచ్ఎం కడలి విజయదుర్గ, ఎంఈవో ఎల్.గణేష్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు గొల్లపల్లి బాబులు, దాట్ల సత్యనారాయణరాజు, దుగ్గన దొరబాబు, సిద్ధాంతపు రాజు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ కె.సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

కరపలో పంపిణీ..

కరప: నక్కా సూర్యనారాయణ మూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ సాదే ఆశాజ్యోతి విద్యార్థులకు జేవీకే కిట్లు అందజేశారు. పాఠశాలకు నూతనంగా బదిలీపై వచ్చిన 11 మంది ఉపాధ్యాయులు, ఆరుగురు ఇంటర్మీడియట్ అధ్యాపకులను ఈ సందర్భంగా పరిచయం చేశారు. ఉప సర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, పాఠశాల పీఎంసీ చైర్మన్ శ్రీపాదం రమాదేవి, హెచ్ఎం యు.లీలామనోహర్ ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమం

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- ఇంద్రపాలెంలో గడప గడపకూ



లబ్ధిదారునికి పథకాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే కురసాల

కాకినాడ రూరల్: మండలంలోని ఇంద్రపాలెం గ్రామంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. సోమవారం సాయంత్రం గ్రామంలోని సచివాలయం–3 పరిధిలోని అర్జుననగర్ ప్రాంతంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నవరత్నాలు, సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు పొందిన లబ్ధిని గ్రామస్తులకు తెలియజేసి అందుకు సంబంధించిన బుక్‌లెట్లను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా ప్రతి పేద కుటుంబానికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. ఇచ్చిన మాటను నిలుపుకొని తూచ తప్పకుండా అమలు చేస్తున్న సీఎం జగన్‌ను, తనను మరోసారి ఆదరించి ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గోపిశెట్టి బాబ్జీ, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ అనుసూరి ప్రభాకర్, పలివెల శ్రీను, డీఎల్‌డీవో నారాయణమూర్తి, ఎంపీడీవో స్వప్న తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజబాబు జయంతి వేడుకలు

కాకినాడ కల్చరల్: స్థానిక ది యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ దంటు కళాక్షేత్రంలో ప్రముఖ నటుడు స్వర్గీయ రాజబాబు 66వ జయంతిని మంగళవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నట్టు ఆయన తనయుడు రమేష్ తెలిపారు. 100 మంది పేద మహిళలకు చీరల పంపిణీ, పేద కళాకారులకు నగదు పంపిణీ చేయనున్నట్టు ఆయన తెలిపారు. అలాగే ప్రముఖ నటుడు కోటేశ్వరావు, రజిత్ మూర్తి, అలపాటి లక్ష్మి, విజయలక్ష్మిలకు రాజబాబు స్మారక అవార్డులు ప్రదానం చేస్తామని తెలిపారు.

ప్రజల పక్షాన నిలిచే ప్రభుత్వమిది



లబ్ధిదారుడికి పథకాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

గడప గడపలో ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 19వ డివిజన్‌లో సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ద్వారంపూడి ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ళ పాలనలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. స్థానికులు వివరించిన పలు సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి ఉన్న ఇటువంటి ప్రభుత్వాన్ని ప్రజలు మళ్లీ గెలిపించాలని కోరారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్లు మీసాల ఉదయ్‌కుమార్, పసుపులేటి వెంకటలక్ష్మి, స్థానిక నాయకులు సిద్ధాంతపు రాజు, పువ్వల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అజ్మీర్ యాత్రికులకు చాదర్ అందజేత

కాకినాడ జగన్నాథపురం ప్రాంతానికి చెందిన 20 మంది భక్తులు సోమవారం అజ్మీర్ యాత్రకు బయలుదేరారు. అంతకు ముందు వారు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని కలుసుకోగా ఆయన చాదర్‌ను అందజేసి, యాత్ర దిగ్విజయంగా సాగాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర విద్యాసాగర్, ఇమామ్‌గౌస్ మోహిద్దీన్, నౌషద్, జె.రామారావుపేట మసీదు అధ్యక్షుడు ఎస్‌కె ఖాజామోహిద్దీన్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బాషా తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో సమస్యల పరిష్కారం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో సమస్యలను ప్రధాని నరేంద్రమోదీ సునాయాసంగా పరిష్కరించారని విదేశాంగ శాఖ సహాయ మంత్రి వి.మురళీధరన్ అన్నారు. మోదీ తొమ్మిదేళ్ల పాలనపై సోమవారం కాకినాడలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. జన్‌ధన్ ఖాతాలు, డిజిటల్ చెల్లింపులు, మాతృ వందన్, అజాదీకా అమృత్ మహోత్సవ్ తదితర పథకాల ప్రగతిని ఆయన వివరించారు. పార్టీని బూత్ స్థాయిలో పటిష్టం చేసేలా పనిచేయాలని శ్రేణులకు సూచించారు. అనంతరం సీనియర్ బీజేపీ నేతలను ఆయన సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షులు చిలుకూరి రామ్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి మురళీధరన్

ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

సామర్లకోట: స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జిపై సోమవారం సాయంత్రం సాంకేతిక లోపంతో ఆయిల్ ట్యాంకరు నిలచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు సిబ్బందితో క్రేన్ సాయంతో ట్యాంకర్‌ను తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.